ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 27 జూన్ 2025



తమిళనాడుకు 31.24 టీఎంసీలు

● కర్ణాటకకు కావేరి జలాల నిర్వాహక కమిటీ ఉత్తర్వులు

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు జూలైలో అందించాల్సిన 31.24 టీఎంసీల జలాలు విడుదల చేయాలని కావేరి జలాల నిర్వాహక కమిటీ కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కమిటీ 117వ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ఛైర్మన్ వినీత్‌గుప్తా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రం తరఫున హాజరైన ప్రతినిధులు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 31.24 టీఎంసీలు నీరు అందించాలని తెలిపారు. అందుకు అభ్యంతరం తెలిపిన కర్ణాటక ప్రతినిధులు.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జూన్‌లో అందించాల్సిన నీటి కన్నా అధికంగా ఇచ్చినట్టు తెలిపారు. అందుకు రాష్ట్ర ప్రతినిధులు, కర్ణాటక కురిసిన భారీవర్షాల కారణంగా డ్యాంలకు భారీగా నీరు రావడంతో అదనపు జలాలు విడుదల చేశారని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నికర కేటాయింపులు కాదని స్పష్టం చేశారు. అనంతరం కమిటీ ఛైర్మన్... తమిళనాడుకు జూలై నెలకు విడుదల చేయాల్సిన 31.24 టీఎంసీలను విడుదల చేయాలని ఉత్తర్వులు జారీచేశారు. కాగా, శుక్రవారం కావేరి జల నియంత్రణ మండలి 41వ సమావేశం జరగనుంది.

కర్ణాటక డ్యాంల నుంచి 63,000 క్యూసెక్కుల నీరు విడుదల

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా కర్ణాటక డ్యాంల నుంచి 63,000 క్యూసెక్కుల నీటిని కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. కృష్ణరాజ సాగర్ డ్యాం నుంచి 33,000 ఘనపుటడుగులు, కబిని నుంచి 33,000 ఘనపుటడుగులు కావేరి నదిలోవి విడుదల చేస్తున్నారు. ఈ నీరు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పిల్లగుండ్లు మీదుగా హొగెనేకల్ చేరుకుంటుంది. దీంతో, హొగెనేకల్ జలపాతం వద్ద నీటి ఉధృతి అధికంగా ఉండడంతో దోనెల సవారీ, పర్యాటకులను నిషేధించారు.

కరుణానిధి బాటలోనే నేను

● ప్రాణమున్నంతవరకూ పార్టీ అధ్యక్షుడినే
● స్టాలిన్‌ను చూసి అన్బుమణి నేర్చుకోవాలి
● పీఎంకే చీఫ్ రాందాస్ ప్రకటన

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'ప్రాణమున్నంతవరకూ పార్టీకి అధ్యక్షుడిని నేనే, అన్బుమణి కార్యాచరణ అధ్యక్షుడిగానే వ్యవహరించాలి, ఇది నా చిరకాల మిత్రుడు, మాజీ సీఎం కరుణానిధి బాణీ, దాన్నే అనుసరిస్తున్నా'... అని దిండివనం తైలాపురం గార్డెన్‌లో గురువారం ఉదయం విలేకరుల సమావేశంలో పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం పీఎంకే శాసనసభ్యుడు అరుళ్‌ను పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా రాందాస్ నియమిస్తే, సాయంత్రానికి ఆయన తనయుడు అన్బుమణి రాందాస్ అరుళ్ నిర్వహిస్తుండిన జిల్లా కార్యదర్శి పదవి నుంచి డిస్మిస్ చేశారు. ఇలా తండ్రీతనయుడు పార్టీలో మార్పులు చేర్పులూ చేస్తుండటంతో పార్టీ శ్రేణులంతా అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.



ఈ నేపథ్యంలో రాందాస్ తైలాపురం గార్డెన్‌లో మీడియా మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి వీల్‌ఛైర్‌కే పరిమితమైనా డీఎంకే అధ్యక్షపదవి నుండి తప్పుకోలేదని, అప్పట్లో స్టాలిన్ పార్టీ అధ్యక్ష పదవి కోసం పాకులాడకుండా హుందాగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఈ విషయంలో స్టాలిన్‌ను చూసి అన్బుమణి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. మురుగన్ మహానాడులో పెరియార్, అన్నాదురైని కించపరిచే వీడియోలను ప్రదర్శించడం గర్హనీయమన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ సర్వసభ్యమండలి సమావేశాన్ని జరుపుతానని, అంతకంటే ముందు పార్టీ కార్యాచరణ, నిర్వాహక కమిటీ సమావేశాలను జరిపి, సభ్యులు అభిప్రాయాలను తెలుసుకుంటానన్నారు. ఎన్నికల వ్యూహరచనలు, కూటమి ఏర్పాటు, చేరడం వంటి నిర్ణయాలను తీసుకుంటానని స్పష్టం చేశారు. సర్వసభ్యమండలి సమావేశం జరిగేటప్పుడే పార్టీ యువజన విభాగం అధ్యక్షుడి నియామకంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అన్బుమణి పార్టీ అధ్యక్ష పదవికోసం పట్టుబడుతున్నారని విలేకరులు ప్రశ్నించగా... ప్రస్తుతం తానిచ్చిన పార్టీ కార్యాచరణ అధ్యక్షుడి పదవిని శిరసావహించి నిర్వహిస్తానని ప్రకటిస్తే పార్టీలో ఏ సమస్య ఉండదన్నారు. మూడేళ్లపాటు అన్బుమణి పార్టీ అధ్యక్షపదవిలో కొనసాగారు కదా మళ్లీ ఆ పదవిపై ఎందుకు ఆరాటపడుతున్నారో అర్థం కావటం లేదన్నారు. తాను పదవుల కోసం పాకులాడేవాడిని కానని, పదవులే కావాలనుకుని ఉంటే కేంద్ర మంత్రివర్గంలో స్థానం పొంది ఉండేవాడినని రాందాస్ చెప్పుకొచ్చారు.

బీజేపీ మతచిచ్చు పెడుతోంది


దివ్యాంగులకు త్రిచక్రవాహనాలను అందజేస్తున్న స్టాలిన్

● ఆ పార్టీ వల్ల అన్నాడీఎంకేకు పెనుముప్పు
● తిరుపత్తూరు సభలో స్టాలిన్
● లబ్ధిదారులకు పథకాల పంపిణీ

చెన్నై,జూన్26(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కులమతాల పేరుతో చిచ్చు రగిల్చేందుకు బీజేపీ యత్నిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు.తిరుపత్తూరు జిల్లా మండలవాడి ప్రాంతంలో గురువారం ఉదయం ఏర్పాటైన సభలో ఆ జిల్లాలో రూ.174.39 కోట్లతో పూర్తైన 90 పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... దేశంలో ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని, ప్రజల జీవన పరిస్థితులు దుస్థితికి చేరాయని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేవని తామంతా ఆందోళన పడుతుంటే, బీజేపీ, అన్నాడీఎంకే చెట్టాపట్టాలు వేసుకుని మతం కోసం బాధపతున్నాయని ధ్వజమెత్తారు.అనంతరం రూ.68.76 కోట్లతో చేపట్టనున్న 60 పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఐదు వరాలు...

ఈ సభలో తిరుపత్తూరు జిల్లా ప్రజలకు ఐదు వరాలను స్టాలిన్ ప్రకటించారు. నేగ్నమలైలో చిన్నారులు స్కూలుకు వెళ్లి రావటానికి, రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు సులువుగా తీసుకెళ్ళి విక్రయించడానికి రూ.30 కోట్లతో 7 కిలోమీటర్ల రహదారిని నిర్మించనున్నట్లు తెలిపారు. కుమారమంగళంలో విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించడానికి రూ.6 కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నామని, నల్లగుండా ప్రాంతంలో 250 ఎకరాల్లో రూ.200 కోట్లతో కొత్త సిప్కాట్ పార్కును ఏర్పాటు చేస్తామని, తిరుపత్తూరు నగరంలోని పాత బస్టాండు వద్ద రూ.189 కోట్లతో పలు అంతస్థులతో వాణిజ్య భవన సముదాయం నిర్మిస్తామని, ఆంబూరు నగర ప్రజల కోసం రూ.కోటితో కొత్త గ్రంథాలయ భవనం నిర్మిస్తామని ఆయన వివరించారు. ఈ సభలో మంత్రులు దురైమురుగన్, ఈవీ వేలు, గాంధీ, ఎంపీలు జగద్రక్షగన్, అన్నాదురై, కదిర్‌ఆనంద్, శాసనసభ్యులు దేవరాజి, నల్లతంబి, విల్వనాథన్, అమలు విజయన్, జిల్లా కలెక్టర్ శివసౌందరవల్లి, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంక్షేమ పథకాల కింద లక్షమందికిపైగా లబ్ధిదారులకు రూ.273.83 కోట్ల సహాయాలను అందజేశారు.

బీజేపీ వల్లే...

వాస్తవానికి బీజేపీ వల్లే రాష్ట్రానికి పెనుముప్పు దాపురించనుందని సీఎం చెప్పారు. మిస్డ్‌కాల్స్ ద్వారా పార్టీని అభివృద్ధిపరచలేనివారంతా తమ రాజకీయ లాభాల కోసం దేవుడి పేరును దుర్వినియోగం చేస్తున్నారని ఆయన విమర్శించారు. భక్తిపేరుతో కపటనాటకాలాడుతున్న బీజేపీకి, ఆ పార్టీకి అండగా నిలిచిన అన్నాడీఎంకేకు ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో మత రాజకీయాలకు తావు లేదని, పెరియార్, అన్నాదురై, కరుణానిధి మతసామరస్యతకోసం పాటుపడిన రాష్ట్రమిదన్నారు.

మూడు వేల ఆలయాలు...

గత నాలుగేళ్ల డీఎంకే ద్రావిడ తరహా పాలనలో రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేనంతగా 3వేల సుప్రసిద్ధ ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించామని, రూ.84 కోట్లతో దేవాలయాలు, మసీదులను మరమ్మతు చేశామని, వీటన్నింటిని చూసి ఓర్వలేకే బీజేపీ మత రాజకీయాలు నడిపేందుకు సిద్ధమైందన్నారు. ఇటీవల జరిగిన మురుగన్ భక్తుల మహానాడులో అన్నాదురై, పెరియార్‌ను కించపరుస్తూ తీసిన వీడియోలను ప్రదర్శిస్తుంటే అన్నాడీఎంకే మాజీ మంత్రులు వాటిని ఆసక్తిగా చూసి ఆ పార్టీ పరువు తీశారన్నారు. ప్రస్తుతం బీజేపీకి పార్టీని తాకట్టుపెట్టిన అన్నాడీఎంకే భవిష్యత్తులో రాష్ట్రాన్ని తాకట్టుపెట్టినా ఆశ్చర్యపడనవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రజలంతా ప్రస్తుతం డీఎంకేని మరోసారి గెలిపించేందుకు సిద్ధమయ్యారని, 2026లో రాష్ట్రంలో డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అన్నాడీఎంకే ఆఫీసులో ప్రేతాత్మ వదంతులు

● శంఖం ఊదిన మాంత్రికుడు!
● సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం


అన్నాడీఎంకే కార్యాలయం

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం 'ఎంజీఆర్ మాళిగై'లో ప్రేతాత్మ సంచరిస్తున్నట్లు వదంతులు షికార్లు చేస్తున్నాయి. వాటిని నిజమని నమ్మే విధంగా ఐదు రోజులుగా ఆ కార్యాలయం వద్ద సాయంత్ర వేళల్లో ఓ మాంత్రికుడు సంచరిస్తూ శంఖాన్ని ఊదుతూ కనిపిస్తున్నాడు. ఓ రోజు ఆ మాంత్రికుడు వేకువజామునే ఆ కార్యాలయం వద్దకు రావడంతో కార్యాలయ సిబ్బంది అతడిని నిర్బంధంలోకి తీసుకుని విచారించారు. ఆ మాంత్రికుడి వివరాలనును కనుగొనేందుకు సిబ్బంది ప్రయత్నించినప్పటికీ బదులివ్వకపోగా ఐదు రోజులుగా సంచరిస్తుంటే ఎందుకు పట్టించుకోలేదంటూ ఎదురు ప్రశ్నించాడు. వారం రోజులుగా తాను శంఖం ఊదుతుంటే నిద్ర పోతున్నారా అంటూ అక్కడి నుండి వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా కేరళకు చెందిన నంబూద్రీలు అన్నాడీఎంకే కార్యాలయం ముందున్న విగ్రహాలను కార్యాలయం వెనుక వైపున ప్రతిష్ఠిస్తే బాగుంటుందని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం. కోరికలు తీరని ఓ ఆత్మ ఆ కార్యాలయంలో సంచరిస్తోందని నంబూద్రీలు హెచ్చరించినట్లు కూడా ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఈ విషయం గురించి అన్నాడీఎంకే సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ.. ప్రస్తుతం అన్నాడీఎంకేపై జరుగుతున్న దుష్ప్రచారాల్లో ఇది కూడా ఒకటి అని వ్యాఖ్యానించడం గమనార్హం.


మొదటి మూడు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థినులు

అగ్రి వర్సిటీ అడ్మిషన్ ర్యాంక్‌ల జాబితా విడుదల

● మొదటి స్థానంలో విద్యార్థిని దివ్య

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, అన్నా విశ్వవిద్యాలయం (వ్యవసాయ శాఖ)లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ కోర్సులో ప్రవేశానికి సంబంధించిన ర్యాంకుల జాబితా విడుదల చేశారు. తమిళనాడు విశ్వవిద్యాలయంలోని 14 యూజీ కోర్సుల్లో 6,921 సీట్లు (ప్రభుత్వ కళాశాలల్లో 2,516 సీట్లు, ప్రైవేటు కళాశాలల్లో 4,405 సీట్లు), అన్నామలై విశ్వవిద్యాలయం వ్యవసాయ విభాగంలో 340 సీట్లకు దరఖాస్తు స్వీకరణ మే 9వ తేది ప్రారంభమై ఈనెల 16వ తేది వరకు పొడిగించామని ముగిసింది. ఈ కోర్సుల్లో అడ్మిషన్లకు 37,707 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 29,349 మంది అర్హులుగా ర్యాంక్ జాబితా విడుదల చేశారు. 18,443 మంది విద్యార్థినులు, 9,370 మంది విద్యార్థులు అర్హత సాధించారు. అకడమిక్ స్ట్రీంలో 27,823 మంది, ఒకేషనల్ స్ట్రీంలో 1,266 మంది అభ్యర్థులు ఉన్నారు. ర్యాంకుల జాబితాలో విల్లుపురానికి చెందిన దివ్య మొదటి ర్యాంక్, కడలూరుకు చెందిన హమ్దా మెహతాబ్ రెండో ర్యాంక్, అదే ప్రాంతానికి చెందిన ఇల్లకియా మూడో ర్యాంక్ సాధించారని వర్సిటీ పేర్కొంది.

పేరంబాక్కంలో నాటుబాంబులతో దాడి

● యువకుడి మృతి
● పోలీసుల అదుపులో ఐదుగురు

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పేరంబాక్కం వద్ద యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు నాటుబాంబులు విసిరి, వేటకొడవళ్లతో దాడి జరిపి హతమార్చారు. పేరంబాక్కం గాంధీనగర్‌కు చెందిన ముఖేష్ (25) గ్యాస్ సిలిండర్ల డెలివరీ బాయ్. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ముఖేష్ తన స్నేహితులు దీపక్, జావీద్‌తో రోడ్డు పక్కగా నిలిచి మాట్లాడతుండగా బైకుల్లో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆ ముగ్గురిపై మూడు నాటు బాంబులు విసిరారు. వాటిల్లో బాంబు మాత్రమే పేలింది. దీంతో ముఖేష్, దీపక్, జావీద్ తీవ్రంగా గాయపడ్డారు. బాంబులు విసిరిన తర్వాత దుండగులు వేటకొడవళ్లతో దాడి జరిపారు. ఈ ఘటనలో ముఖేష్ సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. ముఖేష్ మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తరువాత దుండగులు పరారయ్యారు. సమాచారం అందుకున్న మప్పేడు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ముఖేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన దీపక్‌ను చెన్నై జనరల్ ఆసుపత్రికి, జావీద్‌ను తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. పాతకక్షల నేపథ్యంలో ఈ హత్య జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల ముఖేష్ తమ్ముడు ఆకాష్ అనే వ్యక్తితో సన్నిహితంగా మెలిగేవాడు. ఈ విషయం తెలుసుకున్న ముఖేష్ తమ్ముడిని తీవ్రంగా మందలించాడు. ఈ విషయమై ఏర్పడిన గొడవల్లో ఆకాష్‌కు కత్తిపోటు గాయాలయ్యాయి. ఈ వ్యవహారంలో కక్ష తీర్చుకోవడానికే దుండగులు సామూహికంగా దాడి జరిపినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


ముఖేష్ (ఫైల్ ఫొటో)

చిరుత చిక్కింది

ఊపిరి పీల్చుకున్న వాల్పారై ప్రజలు

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారైలో బాలికను హతమార్చిన చిరుత అటవీశాఖ ఏర్పాటుచేసిన బోనుకు చిక్కింది. పచ్చమలై ఎస్టేట్‌లోని తేయాకు తోటలో పనిచేస్తున్న జార్ఖండ్‌కు చెందిన మనోజ్‌ముండా, మోనిక దంపతుల పెద్ద కుమార్తె రోషిణి ఇంటి బయట ఆడుకుంటుండగా చిరుత బాలికను నోట కరుచుకుని అడవిలోకి లాక్కెళ్లింది. బాలిక కోసం తల్లిదండ్రులు గాలించిన ఫలితం లేకపోయింది. ఆ తరువాత తీవ్ర గాయాలతో పొదల చాటున పడిన రోషిణి మృతదేహాన్ని గుర్తించిన విషయం తెలిసిందే. మనిషి రక్తానికి అలవాటు పడిన చిరుత చేతిలో మరో దారుణం జరుగకముందే దానిని బంధించాలని ఆ ప్రాంత ప్రజలు అటవీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో చిరుతను బంధించేందుకు రెండు బోన్లు ఏర్పాటుచేశారు. గ్రామం నుంచి 50 మీటర్ల దూరంలో ఉంచిన బోనులో గురువారం ఉదయం 5 గంటల సమయంలో చిరుత చిక్కింది. పట్టుబడిన చిరుతను లారీలో దట్టమైన అటవీ ప్రాంతానికి తరలించి విడిచి పెట్టనున్నారు.


బోనులో చిక్కిన చిరుత

రాష్ట్రవ్యాప్తంగా 'సాగర్ కవచ్'

● మాక్‌డ్రిల్‌లో 13 మంది ఉగ్రవాదుల అరెస్టు

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సముద్రతీర ప్రాంతాల్లో ఉగ్రవాదుల చొరబాటును అడ్డుకునేలా 'సాగర కవచ్' పేరిట బుధ, గురువారాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో ఉగ్రవాదుల వేషధారణలో దాగిన 13 మందిని గన్‌పాయింట్‌తో కోస్టు గార్డు, రాష్ట్ర సముద్రతీర పోలీసు దళ సభ్యులు నిర్బంధించారు. బుధవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ విన్యాసాలు గురువారం సాయంత్రం 6 గంటలకు ముగిశాయి. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ ఆదేశాల మేరకు 12 మంది ఎస్పీలు, సంయుక్త పోలీసు కమిషనర్లు, సాయుధ దళ పోలీసులు, ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్ టెర్మినళ్లు, లాడ్జీలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో జరిగిన తనిఖీల్లో పాల్గొన్నారు. మరోవైపు కోస్టుగార్డు, రాష్ట్ర సముద్రతీర పోలీసు దళ సభ్యులు, రెడ్‌ఫోర్సు విభాగానికి చెందిన బలగాలు, ఉగ్రవాద వేషధారణలో వివిధ ప్రాంతాల్లో దాగిన 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విన్యాసాలు చూసిన ప్రజలు పట్టుబడిన వ్యక్తులు ఉగ్రవాదులేమోనని కొద్దిసేపు ఆందోళనకు గురయ్యారు.



మెరీనాతీరంలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

సమాచార దర్శిని

నేడు గిండిలో జాబ్ మేళా

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలో ప్రైవేటు జాబ్ మేళా శుక్రవారం జరగనుంది. గిండి ఆలందూర్ రోడ్డులోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్న ఈ శిబిరంలో 8వ తరగతి నుంచి అన్నిరకాల విద్యార్హతలు ఉన్న వారు పాల్గొనవచ్చు. శిబిరంలో సుమారు 20కి పైగా సంస్థలు పాల్గొననున్నాయని, ఆసక్తి కలిగిన వారు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని అధికారులు తెలిపారు.

నేడు, రేపు చెన్నై బీచ్- తిరువణ్ణామలై మెము రైళ్ల రద్దు

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చెన్నై - రేణిగుంట మార్గంలో కాట్పాడి రైల్వే యార్డులో చేపట్టిన మరమ్మతుల కారణంగా చెన్నై బీచ్- తిరువణ్ణామలై మధ్య ఈనెల 27, 28 తేదీల్లో (శుక్ర, శనివారాల్లో) మెము రైళ్ల సేవలు రద్దు చేస్తూ దక్షిణ రైల్వే పేర్కొంది. కాట్పాడి రైల్వే యార్డులో రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటలవరకు చేపట్టనున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం తిరుపతి నుంచి రాత్రి 7.10 గంటలకు బయలుదేరి కాట్పాడికి వెళ్లే మెము రైలు, కాట్పాడి నుంచి రాత్రి 9.10 గంటలలకు బయలుదేరి తిరుపతికి వెళ్లే మెము రైలు, చెన్నై బీచ్ నుంచి రాత్రి 6 గంటలకు తిరువణ్ణామలైకు బయలు దేరే రైళ్లసేవలు రద్దయ్యాయి. అలాగే గురు, శనివారాల్లో తిరువణ్ణామలై నుంచిసాయంత్రం 4.30 గంటలకు తాంబరం బయలుదేరే మెము రైలును రద్దు చేశారు. అరక్కోణం నుంచి శుక్రవారం రాత్రి 9 గంటలకు కాట్పాడికి వెళ్లాల్సిన మెము రైలును సేవూరు, కాట్పాడి మధ్య, విల్లుపురం నుంచి రాత్రి 7.10 గంటలకు బయలు దేరే మెము రైలు కాట్పాడి - వేలూరు మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శుభ ముహూర్తపు రోజైన శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందజేయనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది. ఆ ప్రకారం, ఒక రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయాల్లో అందిస్తున్న 100 టోకెన్లు బదులు 150, ఇద్దరు రిజిస్ట్రార్లు ఉన్న కార్యాల యాల్లో 200 టోకెన్లకు బదులు 300 టోకెన్లు అందించను న్నారు. అలాగే, తత్కాల్ రిజిస్ట్రేషన్లకు 12 టోకెన్లు అందిస్తుండగా అదనంగా నాలుగు టోకెన్లు ఇవ్వనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది.

మారథాన్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్ నుంచి జులై 6వ తేది మారథాన్ పోటీలు నిర్వహించ నున్నారు. 18 నుంచి 40 ఏళ్లు, 40 ఏళ్లు పైబడిన అని రెం డు విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. పోటీలో పాల్గొనేవారికి టీషర్ట్, సర్టిఫి కెట్ అందించనున్నారు. మొదటి బహుమతులకు రూ.30,000, రూ.20,000, రూ.10,000 అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు https://www.tncu.tn. gov.in/ marathon/ registerలో పేరు నమోదు చేసుకోవచ్చు.

నేడు ఇంజనీరింగ్ కోర్సుల ర్యాంకుల జాబితా విడుదల

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న వారి ర్యాంకుల జాబితా శుక్రవారం విడుదల కానుంది. రాష్ట్రంలోని 440 ఇంజనీరింగ్ కళాశాలల్లో బీఈ, బీటెక్ కోర్సుల్లో సుమారు 2 లక్షల ప్రభుత్వ కోటా సీట్లు ఉన్నాయి. ఈ సీట్లకు 3,02,374 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2,49,883 మంది రుసుము చెల్లించారు. దరఖాస్తు రుసుము చెల్లించిన వారి దరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకోనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 11న ర్యాండమ్ నెంబర్లు కేటాయించారు. కౌన్సిలింగ్ తేదీని మంత్రి కోవి చెళియన్ ప్రకటించనున్నారు.

అత్యవసరంగా ఢిల్లీకి వెళ్లిన గవర్నర్

అడయార్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి అత్యవసరంగా గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. చెన్నై స్వదేశీ విమానాశ్రయం నుంచి ఉదయం 8.05 గంటలకు ఎయిరిండియా విమానంలో ఆయన హస్తినకు వెళ్లారు. ఆయనతో పాటు వ్యక్తిగత కార్యదర్శి, సహాయకుడు, భద్రతా అధికారి ఉన్నారు. ఒక రోజు పర్యటన కోసం ఆయన ఢిల్లీ వెళ్లినట్టు సమాచారం. అయితే, ఇది వ్యక్తిగత పర్యటనా? లేక అధికారికమా? అనేది తెలియలేదు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గవర్నర్ ఢిల్లీకి వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

'పద్మ' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పలు రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి అందజేస్తున్న 'పద్మ' పురస్కారాలకు అర్హులైన వ్యక్తుల నుంచి దరఖాస్తులు కోరుతూ చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్ పిలుపునిచ్చారు. 2026వ సంవత్సరానికి పద్మ అవార్డులు జనవరి 26వ తేదీ రిపబ్లిక్‌డే సందర్భంగా కేంద్రప్రభుత్వం అందజేయనుంది. దేశంలో సాహిత్య, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, వ్యాపారం, పరిశ్రమ రంగాల్లో ఉత్తమ సేవలందించేవారిని పద్మ అవార్డుకు ఎంపిక చేయనున్నారు. ఈ అంశాలతో ఉన్న అర్హులైన అభ్యర్థులు www.padmaawards.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా పూర్తిచేసిన దరఖాస్తు మూడు కాపీలను జిల్లా క్రీడాభివృద్ధి, యువజన సంక్షేమ అధికారి, నెహ్రూ పార్క్, చెన్నై - 600084 అనే చిరునామా కు పోస్టు ద్వారా కానీ నేరుగా వెళ్లి కానీ ఈ నెల 30వ తేదీలోపు సమర్పించవచ్చు. వివరాలకు నెం.740170 3480లో సంప్రదించవచ్చు.

సరికొత్త మైలురాయిని చేరుకున్న ప్రశాంత్ హాస్పిటల్స్



సమావేశంలో వైద్య బృందం

డయార్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ప్రశాంత్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి మైలురాయిని చేరుకుంది. ఫోర్త్ జెన్ టెక్నాలజీని ఉపయోగించి రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ చికిత్సలను 500 మందికి విజయవంతంగా పూర్తి చేసింది. ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్ రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ విభాగం అధిపతి, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ ఎస్.ఆర్ముగం సారథ్యంలోని వైద్యుల బృందం ఈ ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేసిందని గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇందులో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ముగం మాట్లాడుతూ... 'మధుమేహంతో పాటు మోకాళ్ల వ్యాధులతో బాధపడేవారి సంఖ్య క్రమంగా దేశంలో పెరుగుతోందన్నారు. మోకాళ్ళ సమస్యలు యువకుల్లో తలెత్తడంతో నీ రీప్లేస్‌మెంట్ చేయాల్సి వస్తోందన్నారు.

కన్నియాకుమారిలో కుండపోత

● స్తంభించిన జనజీవనం

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో బుధవారం రాత్రి కుండపోతగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి గంటసేపు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. కన్నియాకుమారిలోని మీనాక్షిపురం రోడ్డు, కోట్టార్ రోడ్డు, అసంబు రోడ్డు తదితర రహదారులలో మోకాలి లోతున నీరు ప్రవహించింది. విద్యార్థులు గొడుగులు పట్టుకుని వెళ్లారు. సుశీంద్రం, అంజు గ్రామం, మయిలాడి, కొట్టారమ్ తదితర ప్రాంతాల్లోనూ చెదురుముదురుగా వర్షాలు కురిశాయి. కాళికేశం, గిరిప్పారై ప్రాంతాల్లో వరద పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పేచ్చిపారై, పెరుంజాని, సిట్రారు జలాశయాల పరివాహక ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి. పేచ్చిపారై డ్యాంలో గురువారం ఉదయం నీటిమట్టం 44.21 అడుగులకు చేరింది. డ్యాంలో సెకనుకు 1285 ఘనపుటడుగుల జలాలు ప్రవేశిస్తున్నాయి. డ్యాం నుంచి సెకను 753 ఘనపుటడుగుల చొప్పున దిగువకు వదులు తున్నారు. పెరుంజాని డ్యాంలోను నీటి మట్టం 69.45 అడుగులకు పెరిగింది. డ్యాంలోకి సెకనుకు 900 ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశిస్తున్నాయి. ఈ వర్షాల వల్ల కాళికేశం, గిరిప్పారై, తడింగారోహణం ప్రాంతాల్లోని రబ్బరు తోటల్లో అడుగులోతున నీరు ప్రవహిస్తోంది. దీనితో రబ్బరు కోత పనులు ఆగిపోయాయి.



కన్నియాకుమారిలో వర్షంలో తడుస్తూ వెళుతున్న వాహనాలు

తక్కువ ఎత్తులో ఎయిర్‌ఫోర్స్ విమానాలు


తక్కువ ఎత్తులో వెళ్తున్న విమానం

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో భారత వైమానిక దళం విమానాలు తక్కువ ఎత్తులో వెళ్లడంతో ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. సుమారు 4 గంటల సేపు రెండు విమానాలు అదే ప్రాంతంలో చక్కర్లు కొట్టాయి. విమానాలు తక్కువ ఎత్తులో వెళ్తున్న దృశ్యాలను కొందరు యువకులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ విషయమై జిల్లా పోలీసు యంత్రాంగం స్పందిస్తూ.. పొరుగు రాష్ట్రం కర్ణాటకలోని ఎలాంగా వైమానిక దళం స్థావరం నుంచి వైమానిక దళ పైలెట్లకు శిక్షణలో భాగంగా ఒక విమానం, వారికి భద్రత కల్పించేలా మరో విమానం వచ్చాయని తెలిపారు.

హైకోర్టు విచారణకు నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ విజయాన్ని వ్యతిరేకిస్తూ నయినార్ నాగేంద్రన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. దీనికి నయినార్ నాగేంద్రన్ హాజరయ్యారు. రాబర్ట్ బ్రూస్ ఆస్తులు, కేసులకు సంబంధించి నాగేంద్రన్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అనంతరం తదుపరి విచారణ జూలై 2వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు, ఆ రోజున మళ్లీ హాజరు కావాలని ఉత్తర్వులు జారీ చేసింది.

'ఎంజీఆర్, జయలలిత అన్నాడీఎంకే' పేరుతో కొత్త పార్టీ ఏర్పాటు దిశగా ఓపీఎస్!

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమిలో చేరి రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచి ఓటమిపాలైన మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం కొత్త పార్టీని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. పార్టీకి పేరును కూడా ఎంపిక చేసుకున్నారు. బీజేపీ జాతీయ నాయకులతో పరిచయాలు ఉన్నప్పటికీ రాజకీయంగా ఉన్నత స్థితికి చేరుకోలేకపోయామనే బాధ పట్టిపీడిస్తుండటంతో ఓపీఎస్ చివరకు సొంత పార్టీని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు 'ఎంజీఆర్- జయలలిత అన్నాడీఎంకే' పేరుతో కొత్త పార్టీని ప్రారంభించేందుకు ఎన్నికల సంఘంలో పేరును రిజిస్టర్ చేసే ప్రయత్నాల్లో ఉన్నారు.

రేషన్ సరుకుల సరఫరా వ్యవహారం కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలకు హైకోర్టు నోటీసు

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలకు సరఫరా చేసే సరుకులను ఆ దుకాణం ముందు తూకం వేసేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు వివరణ ఇవ్వాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రప్రభుత్వ రేషన్ దుకాణాల ఉద్యోగుల సంఘం తరుపున హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లో పౌరసరఫరాలశాఖ నిర్వహణలోని గోదాముల నుంచి చౌకదుకాణాలకు సరఫరా చేస్తున్న రేషన్ సరుకుల తూకం సరిగాలేదని ఇందువల్ల ప్రతి చౌకదుకాణంలో ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషీన్ ద్వారా తూకం వేశాకే సరుకులను విక్రయాలకు అనుమతించేలా ఆదేశించాలని కోరారు. గురువారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్, పిటిషనర్‌కు నాలుగు వారాల్లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

రూ.100 కోట్ల యంత్రాలను విక్రయించిన షుగర్ ఫ్యాక్టరీపై చర్యలు

● సీబీఐకి మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో తాకట్టు పెట్టిన రూ.100 కోట్ల విలువైన యంత్రాలను దొంగచాటుగా విక్రయించిన ప్రైవేటు చక్కెర ఫ్యాక్టరీపై కేసు నమోదు చేసి విచారణ జరపాల్సిందిగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కాంచీపురం జిల్లా పాత శివారత్త ప్రాంతంలో పద్మాదేవి షుగర్ ఫ్యాక్టరీ నడుపుతున్న యాజమాన్యం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ.120 కోట్లు, ఇతర బ్యాంకులు, శ్రీనిధి ఫైనాన్స్‌లో పెద్దమొత్తంలో రుణం పొందింది. ఈ రుణం కోసం సుమారు రూ.100 కోట్ల విలువైన యంత్రాలను తాకట్టు పెట్టింది. అయితే ఆ యంత్రాలను దొంగచాటుగా విక్రయించినట్లు సంబంధిత ఫైనాన్స్ సంస్థలు సీబీఐకి ఫిర్యాదు చేశాయి. దీనిపై విచారణ జరపాల్సిందిగా సీబీఐని ఆదేశించాలని కోరుతూ శ్రీనిధి ఫైనాన్స్ తరుపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గురువారం న్యాయమూర్తి భరత చక్రవర్తి ముందు జరిగిన ఈ కేసు విచారణకు సీబీఐ తరుపున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గతంలో ఈ మోసం కేసుకు సంబంధించి విచారణ జరపాలంటూ సీబీఐకి జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కు తీసుకుందని విన్నవించారు. అయితే దీనికి అభ్యంతరం తెలిపిన న్యాయమూర్తి, శ్రీనిధి ఫైనాన్స్ సంస్థ ఫిర్యాదు ఆధారంగా మోసం చేసిన షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై విచారణ జరిపి 3 వారాల్లో కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవల్సిందిగా సీబీఐకి ఉత్తర్వులు జారీ చేశారు.

హామీలు నెరవేర్చకుండా మోసం చేయడమే డీఎంకే నైజం

● పీఎంకే నేత అన్బుమణి

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయడం డీఎంకేకు వెన్నతో పెట్టిన విద్య అని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2021 అసెంబ్లీ ఎన్నికల్లో చౌకదుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఆ దుకాణాలన్నింటినీ ఒకే శాఖ కింద తీసుకురాకుండా నాలుగేళ్లుగా డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో 37,328 చౌకదుకాణాలు పని చేస్తున్నాయని, ఇవి సహకార, పౌర సరఫరాల శాఖల అధీనంలో ఉండటంవల్ల వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులపై పనిభారం పెరిగిందన్నారు. శ్రమకు తగ్గవేతనం అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.


కన్నన్‌కు నియామక పత్రాలు అందజేస్తున్న అన్బుమణి

అన్బుమణి ఆశీస్సులు అందుకున్న కన్నన్

పెరంబూర్ (ఆంధ్రజ్యోతి): పీఎంకే చెంగల్పట్టు పడమర జిల్లా యువజన విభాగం కార్యదర్శిగా జమీన్ రాయపేటకు చెందిన రేణు.కన్నన్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ నియమించారు. నూతన కార్యదర్శిగా నియమితులైన కన్నన్ గురువారం పార్టీ అధ్యక్షుడు అన్బుమణిని కలుసుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కార్యదర్శి నియామక పత్రాలను కన్నన్‌కు అన్బుమణి అందజేశారు.

సర్వీస్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం

16 లగ్జరీ కార్లు దగ్ధం

చెన్నై,జూన్26(ఆంధ్ర జ్యోతి): కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్‌లోని కార్ల మరమ్మతు కేంద్రంలో గురువారం వేకువజాము జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 16 లగ్జరీ కార్లు దగ్ధమయ్యాయి. నాగర్‌కోవిల్ ఏఆర్ క్యాంప్ రోడ్డులో కార్ల సర్వీస్ స్టేషన్‌లో బుధవారం 50కి పైగా కార్లను మరమ్మతుల కోసం తీసుకొచ్చారు. రాత్రి 7గంటలకు సర్వీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న వారంతా డ్యూటీ ముగించుకుని ఇళ్లకు చేరుకున్నారు. సర్వీస్‌స్టేషన్ వద్ద వాచ్‌మన్ కాపలా కాశారు. ఈ నేపథ్యంలో గురువారం వేకువజాము 2 గంటల ప్రాంతంలో సర్వీస్‌స్టేషన్ నుంచి దట్టమైన పొగలు వెలువడ్డాయి. డ్యూటీలో ఉన్న వాచ్‌మన్ వెంటనే అగ్నిమాపక దళానికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక దళం సభ్యులు ఫైరింజన్లతో చేరుకుని మంటలను అదుపు చేస్తుండగా కార్లలో ఉన్న పెట్రోలు, డీజిల్ ట్యాంకులు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో మంటలు నలువైపులా వ్యాపించాయి. ఆ మంటల్లో 16 లగ్జరీ కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. నాలుగు ఫైరింజన్లతో రెండు గంటల పాటు పోరాడి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. నేసమణి నగర్ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.


సర్వీస్‌స్టేషన్ నేలపై ప్రవహిస్తున్న పెట్రోలు, డీజిల్

మహిళా ఎస్ఐపై దాడి

హెడ్ కానిస్టేబుల్ అరెస్టు

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కడలూరులో మహిళా ఎస్ఐ శరణ్యపై దాడి చేసిన హెడ్ కానిస్టేబుల్ బాలమురుగన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొద్ది నెలల క్రితం ఎస్ఐ శరణ్య హెడ్ కానిస్టేబుల్ బాలమురుగన్ వద్ద అప్పు తీసుకుంది. నగదు చెల్లించాలని బాలమురుగన్ ఫోన్ చేసి సమయంలో ఆయన నెంబరును శరణ్య బ్లాక్ చేసినట్లు సమాచారం. ఘటన జరిగిన రోజు ఇంటి ముందు ఉన్న శరణ్య వద్దకు వచ్చిన బాలమురుగన్ ఆమె దూషిస్తూ దాడిచేసినట్లు సమాచారం. ఎస్ఐ ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

నాటపట్టినం జాలర్లపై సముద్ర దొంగల దాడి

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లాకు చెందిన జాలర్లపై సముద్ర దొంగలు దాడిచేశారు. సెరుదూర్ గ్రామానికి చెందిన సెంథిల్‌కు చెందిన పడవలో ఐదుగురు, సురేష్‌కు చెందిన పడవలో ఐదుగురు గురువారం వేకువజామున చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. నడి సముద్రంలో వారు చేపల వేట సాగిస్తున్న సమయంలో, వారిని చుట్టుముట్టిన సముద్ర దొంగలు, వారిపై దాడిచేసి, చేపలు, వలలు, ఇతర ఉపకరణాలు దోచుకెళ్లారు. తీరానికి చేరుకున్న జాలర్లు చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రిలో చేరారు.

కోవై విమానాశ్రయంలో 35 డ్రోన్లు స్వాధీనం

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ నుంచి కోయంబత్తూర్‌కు వచ్చిన విమానంలో అనుమతి లేకుండా తరలిస్తున్న 35 డ్రోన్లను కస్టమ్స్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్ నుంచి వస్తున్న విమానంలో డ్రోన్లు తరలిస్తున్నారంటూ కస్టమ్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో, బుధవారం రాత్రి సింగపూర్ నుంచి వచ్చిన విమాన ప్రయాణికుల లగేజీని అధికారులు స్కానర్‌తో తనిఖీ చేశారు. అందులో రెండు బ్యాగులో 35 ఆధునిక డ్రోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రోన్లు, బ్యాటరీ చైనాలో తయారైనట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో శంకర్ గురు సుబ్రమణియం, జాకీర్ హూసియాన్‌ను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మద్యం తాగి చిందులేసిన అర్చకులు

● నలుగురిపై సస్పెన్షన్ వేటు


మద్యం మత్తులో స్టెప్పులేస్తున్న అర్చకులు

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పూజారులు మద్యం మత్తులో చిందులేసిన ఘటన పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీవిల్లిపుత్తూరులో వెలుగు చూసింది. దీనిపై స్పందించిన రాష్ట్ర హిందూ దేవాదాయశాఖ నలుగురు అర్చకులను సస్పెండ్ చేసింది. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరులోని మారియమ్మన్ ఆలయ జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో పాల్గొనేందుకు వచ్చిన ముగ్గురు అర్చకులు ఆలయ ప్రధాన అర్చకుడు గోవింద వినాయగం ఇంట్లో బస చేశారు. వీరు పీకలదాక మద్యం తాగి సినిమా పాటలకు స్టెప్పులేస్తూ సందడి చేశారు. ఆ దృశ్యాలను ఆలయంలో అర్చకుడిగా పనిచేసి పదవీవిరమణ పొందిన హరిహరన్ కుమారుడు శబరినాథన్ వీడియో తీసి సోషల్ మీడియాలో విడుదల చేశాడు. ఆలయ ప్రాంగణంలో పనిచేస్తున్న మహిళలపై విభూది చల్లిన దృశ్యాలు కూడా ఆ వీడియోలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిందులేసిన అర్చకులపై చర్యలు తీసుకోవాలని హిందూ మున్నని తరుపున ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

ఆర్‌బీఐ పేరుతో మోసం

ఐదుగురి అరెస్టు

అడయార్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భారత రిజర్వు బ్యాంకు పేరు, చిహ్నాన్ని ఉపయోగించి మోసానికి పాల్పడిన ప్రొఫెసర్, ఇంజనీర్‌తో సహా మొత్తం ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రేడియం, కాపర్ వంటి ఖనిజాల విక్రయాలను జరిపినందుకు ఆర్బీఐకు సేవా రుసుం చెల్లించాలంటూ కొందరు ఆర్బీఐ లోగో, చిహ్నాన్ని ఉపయోగించి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తూ వచ్చారు. ఇందుకోసం మైలాడుదురైలో ట్రస్ట్‌ను నెలకొల్పారు. ఈ ట్రస్ట్ పేరుతో మోసానికి పాల్పడ్డారు. ఈ మోసంపై సీబీసీఐడీలో కేసు నమోదైంది. దీనిపై లోతుగా విచారణ జరుపగా, ఇందులో నామక్కల్ జిల్లాకు చెందిన సంజయ్, బెంగళూరుకు చెందిన విఘ్నేష్, మైలాడుదురైకు చెందిన జోసెఫ్‌తో పాటు మరో ఇద్దరికి సంబంధం ఉన్నట్టు గుర్తించి, అరెస్టు చేశారు. సంజయ్ నామక్కల్‌లోని ప్రైవేటు కాలేజీలో ప్రొఫెసర్, జోసెఫ్ ఇంజనీర్. వీరంతా ట్రస్ట్ ఏర్పాటు చేసి తద్వారా మోసాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు.

అడయార్‌లో రెండు లారీల ఢీ

3 గంటలు స్తంభించిన ట్రాఫిక్

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్‌లోని క్యాన్సర్ ఆస్పత్రి వద్ద గురువారం వేకువజాము 5.30 గంటలకు రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డీజిల్ రోడ్డుపై ప్రవహించడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అడయార్ నుంచి వైఎంసీఏకి వెళుతున్న సిమెంట్ కాంక్రీట్ లారీని మురుగునీటి తొలగింపు లారీ ఢీకొంది. దీంతో రెండు లారీలు రహదారిపై బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో మురుగునీటి లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాకుండా రెండు లారీల డీజిల్ ట్యాంక్‌లు పగిలి అందులోని డీజిల్ అంతా రోడ్డుపై ప్రవహించింది. ఈ కారణంగా ఆ మార్గంలో వెళ్ళిన ద్విచక్రవాహనాలన్నీ జారిపడ్డాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని భారీ క్రేన్లతో లారీలను నిలబెట్టి పక్కకు జరిపారు. అనంతరం రాకపోకలను క్రమబద్ధీకరించారు.

మద్యం మత్తులో తగాదా

● ఇద్దరు యువకుల దారుణహత్య

● ముగ్గురు స్నేహితుల అరెస్టు

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట వద్ద మద్యం మత్తులో స్నేహితుల మధ్య తలెత్తిన తగాదా ఇద్దరు యువకుల దారుణహత్యకు దారితీసింది. తచ్చూరుకి చెందిన ఆకాష్ (19), జానకిరామన్ (20) ఈనెల 17న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయమై కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు జరిపారు. ఆ విచారణలో ఊత్తుకోట రోజా వీధికి చెందిన నలంపాండ్యన్ (23), గొయ్యాతోప్పుకి చెందిన 17 యేళ్ల యువకుడు, కావాంగరైకి చెందిన మణి (24) వారిద్దరిని హత్యచేసినట్లు గుర్తించారు. నలంపాండ్యన్, మణి, 17యేళ్ల యువకుడితో కలిసి ఆకాష్, జానకిరామన్ పీకలదాకా మద్యం తాగి గొడవపడ్డారు. చివరకు ఆకాష్, జానకిరామన్‌పై మిగతా ముగ్గురు తమవెంట తెచ్చుకున్న కత్తులతో దాడి జరిపి దారుణంగా హతమార్చారు. ఆ తర్వాత ఇరువురి మృతదేహాలను అరణియార్ వాగులో పూడ్చిపెట్టారు. ఇదిలా ఉండగా నలంపాండ్యన్ మద్యంమత్తులో హత్య చేసినందుకు బాధపడుతూ పోలీసులకు లొంగిపోయాడు. పోలీసులు రంగంలోకి దిగి గురువారం మధ్యాహ్నం వాగులో పూడ్చిపెట్టిన మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టానికి పంపారు.

ఒకే సమయంలో రెండు వృషభ వాహన సేవలు


ఒకేసారి రెండు వృషభ వాహనాల్లో స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా ఆర్ముగనేరి సోమసుందరి అమ్మవారి సమేత సోమనాథ స్వామి ఆలయంలో ఆణి ఉత్తిరై ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు బుధవారం ఉత్సవ మూర్తులను పల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక అభిషేక దీపారాధనలు నిర్వహించిన అనంతరం రాత్రి 9 నుంచి రెండు వృషభ వాహనాల ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. ఈ ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లను భక్తిశ్రద్ధలతో సేవించారు.

బాలుడి కిడ్నాప్ వ్యవహారం నేడు ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్‌పై విచారణ


ఎమ్మెల్యే జగన్‌మూర్తి

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో బెయిల్ కోరుతూ పురచ్చి బారదం అధ్యక్షుడు, కేవీకుప్పం నియోజకవర్గ ఎమ్మెల్యే జగన్‌మూర్తి దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు రానుంది. తిరువళ్లూరు కళాంబాక్కానికి చెందిన ధనుష్, తేనికి చెందిన విజయశ్రీ ప్రేమపెళ్లి వ్యవహారంలో ధనుష్ సోదరుడి కిడ్నాప్‌కు సంబంధించి ఎమ్మెల్యే జగన్‌మూర్తితో పాటు పలువురిపై వ్యతిరేకంగా దాఖలైన కేసులో ఐదుగురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో పోలీసులు తనను అరెస్టు చేస్తారేమోనన్న అనుమానంతో మద్రాస్ హైకోర్టులో ఎమ్మెల్యే జగన్‌మూర్తి తరుపున బెయిల్ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జయచంద్రన్ విచారణను శుక్రవారంకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ తెలిపిన ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.

పల్లావరం: న్యూ కాలనీ 15,16 వీధులు, జీఎస్‌టీ, బీఎస్ఎన్ఎల్, ముమ్మూర్తి నగర్, దర్గా రోడ్డు, పెరుమాళ్ రోడ్డు, పాలిమర్ నగర్, వీపీ వైద్యలింగం రోడ్డు, హైవే నగర్, గారట్‌పూఫ్ నగర్, ఆఫీసర్ లైన్, వీరన్ సందులింగం వీధి, హరియన్ నగర్, ఆర్మీ క్యాంప్, మల్లిక వీధి, ఆర్మీ క్యాంప్ వీధి, భారత్ నగర్, మారియమ్మన్ ఆలయ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, సరోజిని వీధి.

ఆలందూర్: మేట్టుపాళయం, చంద్రన్ వీధి, వండిక్కారన్ రోడ్డు, గోపాలకృష్ణన్ వీధి, విఘ్నేశ్వర వీధి, న్యూ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, మదురైవీరన్ ఆలయ వీధి, సాతానిపేట 1వ వీధి, శంకనేమ్మన్ ఆలయ 1వ వీధి, మార్గో వీధి, పుదుపేట 3వ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, ముదిలిరెడ్డి వీధి, మండి వీధి, ఫైనాన్షియల్ స్కూల్ వీధి, లావు వీధి, వేళచ్చేరి రోడ్డు, వేదగిరి వీధి మార్కెట్.

నందంబాక్కం: సెయింట్ థామస్ మౌంట్, మంగాలిఅమ్మన్ ఆలయ వీధి, తులసింగాపురం వీధి, గణపతి కాలని వీధి, కలైంజర్ నగర్ వీధి, వుడ్ క్రీక్ కౌంటీ వీధి, 60వ క్వార్టర్స్ వీధి, శైవం భవన్ వీధి, సెయింట్ పాట్రిక్స్ చర్చి.

కొరట్టూరు: సుందర్ వీధి, కుబేర గణపతి వీధి, వీటీసీ వీధి, తిరువళ్లువర్ వీధి, వన్నియర్ వీధి, కామరాజ్ నగర్ 1 నుంచి 8 వీధులు, కాకపల్లం, ఎంటీహెచ్ రోడ్డు, రాజా వీధి, టీఎంపీ నగర్, అవ్వై వీధి, మారియమ్మన్ ఆలయ వీధి.

అడయార్: సారథి నగర్, విజయనగర్ జంక్షన్, సీతారాంనగర్, డీప ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, వీజీపీ సెల్వ నగర్, బాలమురుగన్ నగర్, విజయ నగర్ 1 నుంచి 10 వీధులు, రామ్ నగర్ 1 నుంచి 7 వీధులు, బైపాస్ మినీ రోడ్డు, అక్షయం హోటల్ నుంచి మహీంద్ర షోరూం.

కొట్టూరుపురం: రంజిత్ రోడ్డు, మరుదాయ్ అవెన్యూ, చిత్ర నగర్, వాటర్ ట్యాంక్ కాలనీ, తమిళనాడు హౌసింగ్ బోర్డు కాలనీ, నవాబ్ గార్డన్, వెల్లన్ వీధి, దండాయుధపాణి 1,2 వీధులు.

కేకే నగర్: కేకే నగర్ 1 నుంచి 12 సెక్టార్లు, రాజమన్నార్ రోడ్డు, రామస్వామి రోడ్డు, లక్ష్మణస్వామి రోడ్డు, ఆర్కే షణ్ముగం రోడ్డు, నెశపాక్కం ఏరియా, పీటీ రాజన్ రోడ్డు ఏరియా, అశోక్ నగర్ 1,9,11 అవెన్యూలు, కన్నికాపురం, విజయరాగపురం, 80 అడుగుల రోడ్డు.

ఆవడి: జేపీ నగర్, జ్యోతి నగర్, శ్రీ శక్తి నగర్, పవర్ లైన్ రోడ్డు, సెంథిల్ నగర్, గ్రీన్ ఫీల్డ్, సోమసుందరం అవెన్యూ, వెంకటాచలం నగర్, కమలం నగర్, ఒరగడం సొసైటీ.

షోళింగనల్లూర్: పెరుంబాక్కం గాంధీ నగర్ సొసైటీ, కాసాగ్రాండ్ చెర్రీ పిక్, ఆక్సిజన్ నగర్ ట్రీ, ఆదిని వీధి, రేడియన్స్ మెర్క్యురీ.

దురైపాక్కం: రాజు నగర్, మేట్టుకుప్పం, వీటీసీ వీధి, వీటీసీ హౌసింగ్, జ్యోతిమాత ఆలయ వీధి, శక్తి గార్డన్, చౌడేశ్వరి నగర్, సీడీఎస్, పిళ్లయార్ ఆలయ వీధి, ఒక్కియంపేట, చంద్రశేఖరన్ అవెన్యూ, నెహ్రూ నగర్, రాజీవ్ గాంధీ రోడ్డు, కన్నగి నగర్, టీఎన్ఎస్‌సీబీ, స్లమ్ ఏరియా రోడ్డు, ఓఎంఆర్, ఎంజీఆర్ వీధి, కాళియమ్మన్ ఆలయ వీధి, కారపాక్కం, రివర్ వ్యూ కాలని.

పోరూర్: అయ్యప్పన్‌తాంగళ్ ప్రిన్స్ హైల్యాండ్ అపార్ట్‌మెంట్, దక్షిణ అపార్ట్‌మెంట్, కుప్పుస్వామి నగర్, అరుణాచలం రోడ్డు, కడువేట్టి, వీరరాఘవపురం, ఆవడి మెయిన్ రోడ్డు కొంత భాగం.



కెరీర్‌కు ‘కన్నప్ప’ టర్నింగ్ పాయింట్ : సంపత్‌రామ్

తన సినీ కెరీర్‌కు ‘కన్నప్ప’ టర్నింగ్ పాయింట్ అవుతుందని, ఈ చిత్రం విడుదలైన తరువాత తనకు పలువురు సినీ దర్శకులు తమతమ చిత్రాల్లో అవకాశాలు ఇస్తారన్న నమ్మకం ఉందని నటుడు సంపత్‌రామ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో పాన్ ఇండియా చిత్రంగా రూపొందిన ‘కన్నప్ప’లో సంపత్‌రామ్ ‘చండుడు’ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానున్న నేపథ్యంలో తన పాత్ర గురించి సంపత్‌రామ్ మాట్లాడుతూ... ‘ఇందులో నటించే అవకాశం రావడానికి ప్రధాన కారణం డాక్టర్ మోహన్‌బాబు. మంచు విష్ణుకు పరిచయం చేయడంతో ‘కన్నప్ప’లో ముఖ్య పాత్రను పోషించా. సినిమా విడుదలైన తర్వాత ఇండస్ట్రీలో నా కంటూ ఓ గుర్తింపు లభిస్తుందన్న నమ్మకం ఉంది. ఒక నటుడు కఠోర శ్రమకు గుర్తింపు ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకోవడమే. ఈ చిత్రంలో అలాంటి పాత్రలోనే నటించా. సినిమా చూసిన తర్వాత అనేక మంది దర్శకులు నన్ను వివిధ పాత్రల కోసం ఎంచుకుంటారన్న నమ్మకం ఉంది. అంతటి మంచి పాత్రలో నటించా. ఈ సినిమా ఘన విజయం సాధించాలని అరుణచలేశ్వరస్వామిని దర్శించుకుని, గిరి ప్రదక్షిణ చేశా. అలాగే శ్రీకాళహస్తి ఆలయంలోని కన్నప్ప చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశా’ అని చెప్పారు.

చిత్రజ్యోతి

‘మదరాసి’పైనే రుక్మిణి ఆశలు



కన్నడ చిత్రసీమలో ప్రముఖ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్... గంపెడాశలతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ప్రముఖ నటుడు విజయ్ సేతుపతితో కలిసి ‘ఏస్’లో ఆమె నటించారు. అయితే, ఆ సినిమా ఆమెకు సరైన బ్రేక్ ఇవ్వలేకపోయింది. దీంతో ఆమె తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు ఏ.ఆర్.మురుగదాస్ - హీరో శివకార్తికేయన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ‘మదరాసి’ చిత్రంపైనే ఆమె ఆశలన్నీ ఉన్నాయి. ఇందులో ఆమె శివకార్తికేయన్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు. కన్నడంలో ఆమె నటించిన చిత్రాలు అతి తక్కువే అయినప్పటికీ మంచి టాలెంట్ ఉన్న నటిగా గుర్తింపు పొందారు. అందుకే మురుగదాస్ తన చిత్రంలో కోసం ఆమెను ఎంపిక చేసుకున్నారు. దీంతో ‘ఏస్’ చిత్రం ఆమెను నిరాశపరిచినప్పటికీ ‘మదరాసి’పై ఆమె ఎన్నో ఆశలు పెట్టుకునివున్నారు.

రూ.100 కోట్ల క్లబ్‌లో ధనుష్ ఐదో చిత్రం



‘కుబేర’లో ధనుష్

హీరో ధనుష్ నటించిన తాజా చిత్రం ‘కుబేర’ రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. తద్వారా ఆయన ఇప్పటివరకు నటించిన చిత్రాల్లో ఐదు ఆ క్లబ్‌లో చేరాయి. ధనుష్ నటుడిగా తొలిసారి తమిళంలో వెండితెరకు పరిచయమైనప్పటికీ ఆయన నటించిన చిత్రాల్లో రూ.100 కోట్ల మేరకు వసూళ్లు సాధించిన చిత్రల్లో తొలి చిత్రం హిందీ మూవీ కావడం గమనార్హం. 2013లో వచ్చిన ‘రాంజన’ ఈ రికార్డును సొంతం చేసుకుంది. తమిళంలో తొలిసారి ‘తిరుచిత్రాంబలం’ ఈ జాబితాలో చేరింది. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన ‘వాత్తి’, గత యేడాది ధనుష్ హీరోగా నటించి దర్శకత్వం వహించిన ‘రాయన్’ రూ.100 కోట్లను వసూలు చేసిన జాబితాలో ఉన్నాయి. ఇప్పుడు శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ‘కుబేర’ వంద కోట్లను సాధించినట్టు నిర్మాతలు అధికారికంగా వెల్లడించారు. ఇందులో టాలీవుడ్ అగ్రహీరో అక్కినేని నాగార్జున కూడా ప్రత్యేక పాత్రను పోషించిన విషయం తెల్సిందే.

డ్రగ్స్ కేసులో నటుడు కృష్ణ అరెస్టు



డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కోలీవుడ్ యువ నటుడు కృష్ణను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో పోలీసులు హీరో శ్రీరాంను అరెస్టు చేసి, జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించిన విషయం తెల్సిందే. అన్నాడీఎంకే ఐటీ విభాగం మాజీ నేత ప్రసాద్‌కు డ్రగ్స్‌కు సరఫరా చేసిన ప్రదీప్‌ను కొన్ని రోజుల క్రితం చెన్నై నార్కోటిక్స్ ఇంటెలిజెన్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన వాంగ్మూలం ఆధారంగా ప్రముఖ నటుడు శ్రీరాంను డ్రగ్స్ కేసులో అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఈ నేపథ్యంలో ‘కళుగు’ చిత్రంలో నటించిన కృష్ణకు కూడా డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్నట్టు ప్రచారం జరిగింది. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని 14 గంటల పాటు పోలీసులు విచారించారు. ఇందులో పలు ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టినట్టు సమాచారం. అన్ని రకాలైన ఆధారాలు సేకరించిన పోలీసులు కృష్ణను అరెస్టు చేశారు.

చిత్రపరిశ్రమలో డ్రగ్స్ వినియోగం ఉంది : గాయని సుచిత్ర



చిత్రపరిశ్రమలో మాదకద్రవ్యాల వినియోగం ఉందని ప్రముఖ సినీ నేపథ్యగాయని సుచిత్ర ఆరోపించారు. డ్రగ్స్ కేసులో హీరో శ్రీరాం అరెస్టుపై ఆమె సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. ఈ కేసులో అరెస్టయిన శ్రీరాం న్యాయమూర్తి ఎదుట తన బిడ్డను చూసుకోవాలంటూ బోరున విలపించారని, మరి డ్రగ్ తీసుకునే సమయంలో కొడుకు గుర్తుకు రాలేదా అని ఆమె ప్రశ్నించారు. కోలీవుడ్‌లో కొందరు కొకైన్‌ను వినియోగిస్తున్నారని, సాధారణంగా డ్రగ్స్ తీసుకునే సినీ సెలబ్రిటీలు రక్త పరీక్షలకు అంగీకరించరని పేర్కొన్నారు. బాలీవుడ్ హీరో షారూక్ ఖాన్ కుమారుడికి కూడా రక్తపరీక్షలు చేశారా లేదా అనే విషయం తనకు తెలియదన్నారు. తమిళ చిత్రపరిశ్రమలో కొన్ని అతిథి పాత్రలు, ఐటమ్ సాంగ్‌లలో నటించేందుకు వచ్చే బాలీవుడ్ నటులు, నటీమణులు డ్రగ్స్ కల్చర్‌ను కోలీవుడ్‌లోకి చొప్పించారన్నారు. ముంబై నుంచి కోలీవుడ్‌కు వచ్చే నటీనటులు ఇక్కడ ఏమైనా చేయవచ్చన్న భావనతో ఉంటున్నారని, వారి గురించి ఇక్కడ ఎవరూ నోరు మెదపరన్నారు. పూర్వం తాగుడుకు బానిసలుగా వున్నవారు కోలుకునేందుకు భార్యలు సహకరించేవారని, కానీ ఇప్పుడు హీరోలకు భార్యలే మందు, మాదకద్రవ్యాలు అందిస్తున్నారన్నారు. విదేశాల నుంచి కూడా తెప్పించి ఇస్తున్నారని ఆరోపించారు. చెన్నైలో మద్యపాన దుకాణాల బాత్రూంలలో కూడా డ్రగ్స్ వినియోగం జరుగుతుందని, వీటిపై ఎవరు చర్యలు తీసుకుంటారని సుచిత్ర ప్రశ్నించారు.

నేటినుంచి మొహర్రం సమ్మేళనం



ముఫద్దల్ సైపుద్దీన్‌కు ఆహ్వానం పలుకుతున్న ఇస్లామీయులు

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ సాంస్కృతిక రాజధానిగా పిలువబడే రాజధాని నగరం సమైఖ్యత, వైవిధ్యం, మతసామరస్యాన్ని ప్రోత్సహించేందుకు అనుకూలంగా 9 రోజుల పాటు నిర్వహించనున్న మొహర్రం సమ్మేళనం శుక్రవారం ప్రారంభం కానుంది. ఇందులో పాల్గొనేందుకు ఇప్పటికే దావూదీ బోహ్రా ముస్లిం సమాజం 53వ నేత సయ్యదనా ముఫద్దల్ సైపుద్దీన్ నగరానికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ సమ్మేళనంలో ప్రపంచ నలుమూలలనుంచి సుమారు 43వేల మంది దావూదీ బోహ్రా సభ్యులు పాల్గొననున్నారు.ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ సమ్మేళనాన్ని ప్యారీస్ మూర్ వీధిలో ఉన్న దావూదీ బెరక్ మసీదులో శుక్రవారం ప్రారంభంకానుంది. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నారు. కాగా, మొహర్రం సమ్మేళన కార్యక్రమాలను ప్యారీస్ ఆర్మేనియన్ వీధిలోవున్న బిన్నీమిల్ గ్రౌండ్, రాయపేట వైఎంసీఏ గ్రౌండ్, కీల్పాక్ వింగ్స్ కన్వెన్షన్ సెంటర్, రాయపురం శెట్టిగార్డెన్ తదితర 9 ప్రాంతాల నుంచి సభ కార్యక్రమాలు టీవీ ద్వారా ప్రత్యక్షప్రసారం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ నేపథ్యంలో, ట్రిప్లికేన్, జామ్‌బజార్, ఐసహౌస్, రాయపేట, థౌజండ్‌లైట్స్, నుంగంబాక్కం, కీల్పాక్, పులియాన్‌తోపు, పట్టాలం, పెరంబూర్, రాయపేట తదితర ప్రాంతాల్లో పీర్ల పండుగ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చావళ్లలో రకరకాల పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు.

శ్రీరామచంద్రతో బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ‘శ్రీ రామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్’తో బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు విద్యా సహకారం, వైద్య పరికరాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించడం, భవిష్యత్ ఆరోగ్య సంరక్షణ నిపుణులను ఆచరణాత్మక అనుభవంతో సన్నద్ధం చేయడంపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకం చేశారు. ఈ ఒప్పందంపై శ్రీ రామచంద్రా వర్శిటీ వీసీ డాక్టర్ ఉమా శేఖర్, బీపీఎల్ సంస్థ ఎండీ డాక్టర్ శ్రావణ్ సుబ్రమణ్యం సుబ్రమణ్యం చేయగా, ఈ కార్యక్రమంలో ఇంకా వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సెంథిల్ కుమార్, డీన్ కె.బాలాజీ సింగ్, బీపీఎల్ సంస్థ సీఈవో కె.గురుస్వామి తదితరులు కూడా పాల్గొన్నారు.

గురుపరిహార క్షేత్రం

కాయారోహణేశ్వరాలయం

● వివాహ యోగం, ముక్తి ప్రదాత క్షేత్రం

టి.నగర్, ఆంధ్రజ్యోతి

కుంభకోణం క్షేత్రంలో ఉన్నట్లే ఆలయాల నగరం కాంచీపురంలోనూ నవగ్రహ క్షేత్రాలున్నాయి. వీటిలో కాంచీపురం నగరం దక్షిణ దిశగా వేగవతి నదీ ఉత్తర తీరాన పిళ్లయార్‌పాళయంలో కమలాంబికై సమేత కాయారోహణేశ్వరర్ ఆలయం గురుపరిహార స్థలంగా విరాజిల్లుతోంది. కామాక్షి, సరస్వతి, లక్ష్మీదేవి తపమాచరించిన పుణ్యస్థలం కాంచీపురంలో ఈ ఆలయం గురుభగవానుడి అనుగ్రహ క్షేత్రంగానే కాకుండా భక్తులకు వివాహయోగాన్ని, మోక్ష ప్రాప్తిని కల్పిస్తుందని శైవ పండితులు చెబుతున్నారు. ఈ ఆలయ తీర్థకొలను పంచకోణతీర్థంగా ఉండటం విశేషదాయకం.



ఆలయ ప్రవేశద్వారం

ఆలయ వైభవం...

ఈ ఆలయం తూర్పుదిశగా ప్రవేశద్వారంతో నిర్మితమై ఉంది. ప్రవేశద్వారంలో గురుభగవానుడు, బ్రహ్మ, పరమేశ్వరుడు, మహావిష్ణువు, పార్వతీదేవి శిల్పాలు ఉన్నాయి. ఆ ప్రవేశద్వారాన్ని దాటుకుని వెళితే మూడంతస్థుల రాజగోపురం దర్శనమిస్తుంది. లోపల బలిపీఠం, నంది విగ్రహం ఉన్నాయి. గర్భాలయంలో మూలవిరాట్టు కాయారోహణేశ్వరస్వామి తూర్పుదిశగా లింగమేనిగా దర్శనమిస్తున్నారు. గర్భాలయం వెనుక గోష్ఠంలో సోమస్కందర్ శిల్పం కనువిందు చేస్తుంది. కుడ్యాలపైనే వినాయకుడు, దక్షిణామూర్తి, విష్ణు, బ్రహ్మ, దుర్గాదేవి శిల్పాలున్నాయి. దుర్గాదేవికి ఎదురుగా చండికేశ్వరుల సన్నిధి ఉంది. గర్భాలయం ‘గజపృష్ఠ రూపం’లో నిర్మితమై ఉంది. ఇలాంటి రూపాన్ని తొండైమండల ప్రాంతంలోనే విశిష్ఠమైన రూపంగా చెబుతారు. ఇక అమ్మవారు కమలాంబికై నామధేయంతో ప్రత్యేక సన్నిధిలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. అంతర ప్రాకారంలో వేర్వేరు సన్నిధుల్లో కర్పగ వినాయకుడు, వళ్లీ, దైవానై సమేత ఆరుముగస్వామి, మహాలక్ష్మి, నవగ్రహాలు, భైరవుడు, సూర్యభగవానుడు కొలువుదీరి ఉన్నారు. ఆలయంలో ప్రవేశించగానే ఎడమవైపు మండపంలో ‘నాల్వర్’ (అప్పర్, సుందరర్, సంబంధర్, మాణిక్యవాచగర్) సన్నిధి, నాగదేవతల సన్నిధి ఉన్నాయి. ఆ ప్రాంతంలోనే ‘మాద్రిద లింగంగళ్’ పేరుతో ఆరు శివలింగాలు దర్శనమిస్తాయి. వాటిలో రెండు విగ్రహాలు ఆవుడయార్‌తోనూ, నాలుగు విగ్రహాలు ఆవుడయార్ రహితంగాను ఉన్నాయి. ఈ విగ్రహాలకు చేరువగానే బాల మురుగన్ నిలిచిన భంగిమలో దర్శనమిస్తున్నారు.





ఆరు శివలింగాలు - గురుభగవానుడు, కాయారోహణేశ్వరస్వామి

కాయారోహణం అంటే...



బ్రహ్మదేవుడు

ఇంతకీ కాయారోహణం అంటే ఏమిటి? ‘కాయం’ అంటే దేహం, ‘ఆరోహణం’ అంటే పైకెత్తుకోవడం అని అర్థం. పూర్వం బ్రహ్మ, మహావిష్ణువు చరమదిశలో ఉన్నప్పుడు వారి పవిత్రదేహాలను పరమేశ్వరుడు తన భుజాలపై వేసుకుని నృత్యం చేయడం వల్ల ఈ క్షేత్రానికి ‘కాయారోహణం’ అనే పేరొచ్చింది. లక్ష్మీదేవి కాయారోహణేశ్వరుడిని బిల్వదళాలతో అర్చించి మహావిష్ణువును భర్తగా పొందింది. గురుభగవానుడు వేగవతి నదీ దక్షిణతీరాన ఉన్న ‘తాయార్‌కుళం’ అనే కాయారోహణ తీర్థంలో స్నానమాచరించి కాయారోహణేశ్వరస్వామిని ఆరాధించి దేవతలందరికీ గురువుగా పీఠారోహణం చేశారు. కనుకనే ఈ ఆలయంలో లక్ష్మీదేవి, గురు భగవానుడికి వేర్వేరు సన్నిధులున్నాయి. ఇక యమధర్మరాజు కాయారోహణేశ్వరుడిని పూజించి, దక్షిణ దిక్పాలకుడిగా మారారు. ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటే సకల సంపదలు, జ్ఞానం, వివాహ యోగం, గృహయోగం, మోక్షం ప్రాప్తిస్తాయన్నది ఐతిహ్యం.



సోమస్కందర్ - ఆలయంలో చోళులకాలం నాటి మండప స్తంభం - దక్షిణామూర్తి

గురుభగవానుడి దృష్టి...

ఆధ్యాత్మికం

‘గురు దృష్టి కోటి పుణ్యం’ అని గురుభగవానుడి దృష్టి ప్రసరిస్తే కోటి పుణ్య ఫలాలు ప్రాప్తిస్తాయని తమిళులు భావిస్తారు. నవగ్రహాల్లో అత్యధిక సత్ఫలితాలనిచ్చేది ఈ గురు భగవానుడే. అంగీరస మహర్షి కుమారుడిగా జన్మించిన ఈ గురుభగవానుడు ‘బృహస్పతి’గా కీర్తింపబడి జ్ఞానకారకుడు. ఆలయంలో పడమటి దిశలో ప్రత్యేకసన్నిధిలో వేద గురు, బృహస్పతిగా కీర్తింపబడుతున్న ఈ స్వామివారు నమస్కరిస్తూ ఆశీన భంగిమలో దర్శనమిస్తున్నారు. గురుపరిహార స్థలం కనుక ఈ ఆలయానికి ‘గురు ఆలయం’ అనే పేరు కూడా ఉంది. గురుసంక్రమణ సందర్భంలో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయానికి బిల్వవృక్షం స్థల వృక్షం. మహాలక్ష్మి నిర్మించిన ఈ ఆలయ కొలనును ‘తాయార్‌కుళం’, ‘లక్ష్మీకుండం’, ‘గురువార తీర్థం’ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఆలయ కొలనులు నాలుగు దిక్కులు కలిగిఉంటాయి. అయితే ఈ ఆలయ తీర్థం ఐదు దిక్కులు కలిగిన పంచకోణతీర్థంగా ఉండటం విశేషం. ఈ కొలనుకు పడమటి దిశగా యమధర్మరాజు పూజించిన ధర్మలింగేశ్వరాలయం ఉంది. ఈ ఆలయంలో నేతిదీపం వెలిగిస్తే యమభయం తొలగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో రోజూ పంచకాల పూజలు నిర్వహిస్తారు. గురువారాల్లో ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి. గురుసంక్రమణ దినాన లక్షార్చనలు, నవరాత్రి, మహా శివరాత్రి వేడుకలు, ధనుర్మాస అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

ఎలా వెళ్లాలి?...

కాంచీపురం వెళ్లడానికి చెన్నై సహా ప్రధాన నగరాలనుంచి ప్రభుత్వ రవాణ సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సులున్నాయి. ఈ ఆలయం పెద్ద కాంచీపురం బస్టాండుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. బస్టాండు నుంచి ఆలయానికి ఆటోలు, షేర్ ఆటోల్లో చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 నుండి రాత్రి 7.30 వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఏలగిరి పర్యాటక కేంద్రంలో రోప్‌కార్ వసతి



ప్రణాళిక తయారీ పనులు ప్రారంభం



కొండప్రాంతం

ప్యారీస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లాలో రమ్యమైన ప్రకృతి, ఆహ్లాదకమైన వాతావరణంలో సముద్రమట్టానికి 1,200 మీటర్ల ఎత్తులో నాలుగు కొండలపై ఉన్న ఏలగిరి పేదల ఊటీగా ప్రసిద్ధి చెందింది. కొండపైకి చేరుకోవాలంటే పొన్నేరినుంచి 14 మలుపులతో కూడిన ఘాట్ ఉంది. వర్షాకాలంలో మట్టిచర్యలు విరిగి పడుతుండటంతో తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఏలగిరి పైకి చేరుకునేందుకు వీలుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఏలగిరిలో పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు అసెంబ్లీలో పర్యాటకశాఖ మంత్రి రాజేంద్రన్ ప్రకటించారు. ఇందులో భాగంగా రోప్ కార్ వసతి కల్పించడంపై సమగ్ర ప్రణాళిక తయారీ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు పర్యాటకశాఖ అధికారులు తెలిపారు. కాగా తిరుపత్తూరు నుంచి 30 కిలోమీటర్ల దూరంలో, చెన్నై విమానాశ్రమం నుంచి 224 కిలోమీటర్ల దూరంలో, బెంగళూరు నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఏలగిరి వేసవి విడిది కేంద్రం ఉండటంతో ఇక్కడికి సంవత్సరమంతా స్వదేశీ, విదేశీ పర్యాటకులు వచ్చివెళ్తుంటారు. 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఏలగిరిలో సహజసిద్ధమైన పార్కు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, నక్ప్యూట్ హౌస్, నీలావూరు సరస్సు, అంజనేయ స్వామి ఆలయం, మంగళం చెరువు, బోట్ హౌస్ ఉన్నాయి.



బోట్ సవారీ





ప్రసాదాలు బావున్నాయి

● ప్లీజ్.. ఇలానే కంటిన్యూ చేయండన్న నటుడు రఘు



ఆలయం ముందు రఘు - బండ్ల గణేష్

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు బావున్నాయని సినీనటుడు రఘు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో గతానికి ఇప్పటికి చాలా మార్పులు వచ్చాయన్నారు. అనేక చోట్ల కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి సేవలు అందించడం బావుందన్నారు. 'ప్రసాదాల రుచి బావుంది.. ప్లీజ్ .. ఇలానే కంటిన్యూ చేయండి' అని అన్నారు. అలాగే 'కోర్టు' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రీదేవి, నిర్మాత బండ్ల గణేష్ కూడా గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఇంకా ఉత్తరాఖండ్ మాజీ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మాధవి రెడ్డి, పులివర్తి నాని కూడా గురువారం స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

హైదరాబాదు- కన్యాకుమారి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూన్26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాదు-కన్యాకుమారి మధ్య తిరువణ్ణామలై మీదుగా 8 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరువణ్ణామలై పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న రద్దీని తెలుసుకొని వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జూలై 2 నుంచి 25వ తేది వరకు రాక పోకలు సాగిస్తాయన్నారు. హైదరాబాదులో ఈ ప్రత్యేక రైలు(07230) జూలై 2న (బుధవారం) సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి సికింద్రాబాదు, నల్లగొండ, నడికుడి, గుంటూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి, తిరువణ్ణామలై మీదుగా కన్యాకుమారికి 3వ తేది అర్ధరాత్రి దాటాక 2.30 గంటలకు చేరుకొంటుందని తెలిపారు. 4వ తేది (శుక్రవారం) ఉదయం 5.15 గంటలకు ఈ ప్రత్యేక రైలు(07229) బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ 5వ తేది మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాదు చేరుకొంటుందన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,001

తలనీలాలు సమర్పించినవారు: 23,765



దృష్టి సారిస్తే ఈ తీరాలు మణిహారాలు

ఎగసిపడే అలలు.. లయబద్ధంగా వినిపించే తరంగాల హోరు.. విశాలంగా పరచుకున్న ఇసుక తిన్నెలు.. నీలాకాశ అంచుల్ని ముద్దాడుతున్నట్లు కనిపించే సముద్రం సందర్శకులను కట్టిపడేస్తాయి. మనసు దోచుకునే ఈ ప్రకృతి రమణీయ తీరాలు చేరువలోనే ఉన్నాయి. అయితే ఆలనాపాలనా లేక ఆదరణకు దూరమవుతున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రముఖ బీచ్‌ల సరసన చేరే సత్తా ఈ సుమనోహర తీరాలకుంది.

- గూడూరు, (ఆంధ్రజ్యోతి)

ఈ బీచ్‌లకు ఎలా వెళ్లాలంటే...

గూడూరు నుంచి గుమ్మళ్లదిబ్బకు 38 కిలోమీటర్లు దూరం. ఆర్టీసీబస్సు సౌకర్యం ఉంది. గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో బీచ్ ఉంటుంది. నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా పోర్టురోడ్డు గుండా సుమారు 48 కిలోమీటర్లు ఉంటుంది. కోట నుంచి సుమారు 30 కిలోమీటర్లలోపే దూరం ఉంటుంది. నెల్లూరు, గూడూరు, కోట ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యముంది. తీగపాళెం బీచ్‌కు వెళ్లాలంటే లింగవరం నుంచి లేదా, గుమ్మళదిబ్బ నుంచి వెళ్లాలి. అయితే రెండు కిలోమీటర్ల మేర గ్రావెల్‌రోడ్డులో వెళ్లాలి. తారు రోడ్డు సౌకర్యం లేక చాలామంది వెనుకడుగేస్తున్నారు.

పర్యాటకాభివృద్ధితో ఉపాధికి ఊతం

ఇక్కడి బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానిక మత్స్యకారులకు జీవనోపాధి మెరుగుపడుతుంది. వివిధ రూపాల్లో ఇతరులకూ ఉపాధి కలుగుతుంది. రాష్ట్రానికి కొంత ఆదాయమూ సమకూరుతుంది. క్రిస్‌సిటీ నేపథ్యంలో ఇక్కడి బీచ్‌లపై పర్యాటకశాఖ ఫోకస్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తీగపాళెం తీరంలో సందర్శకుల సందడి



తీగపాళెం బీచ్‌కు ఈ ఇరుకుదారే ఆధారం



తీగపాళెంలో పర్యాటకాభివృద్ధిపై పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్‌ఫొటో)

● సహజ అందాలకు నెలవు గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం బీచ్‌లు



గుమ్మళ్లదిబ్బ తీరంలో సోయగాలు

సహజ సౌందర్యానికి కేరాఫ్‌గా నిలుస్తాయి చిల్లకూరు మండలం గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం గ్రామాల బీచ్‌లు. ఫోకస్ లేక వీటి ఉనికి అంతంతమాత్రమైంది. సాధారణంగా సాగర తీరం అభివృద్ధి చేస్తే పర్యాటకంగానే కాదు.. ఎన్నో అంశాలనూ ఇది ప్రభావితం చేస్తుంది. గుజరాత్ తీరం ఆధారంగానే అభివృద్ధి సాధించింది. పాండిచ్చేరి, చెన్నై, గోవా, కేరళలోనూ బీచ్‌లను పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నారు. గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం బీచ్‌లను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేస్తే సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.



గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతంలో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రం

■ పరిశీలనే తప్ప పురోగతి ఏది?

గుమ్మళ్లదిబ్బ బీచ్‌లో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణా కేంద్రముంది. కృష్ణపట్నం పోర్టు నుంచి ఇక్కడికి ఆరు కిలోమీటర్ల దూరం. తీగపాళెం బీచ్ 9 కిలోమీటర్ల దూరం. సమీపాన తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వస్తుంటారు. తూర్పుకనుపూరు నుంచి ఈ బీచ్‌లకు 15 కిలోమీటర్ల దూరమే. పోర్టు సందర్శకులు, అమ్మవారి భక్తులకు మానసిక ఉల్లాసాన్ని పంచేందుకు ఈ రెండు బీచ్‌లు దోహదపడతాయి. వేసవి సెలవుల్లో కుటుంబసమేతంగా వచ్చి సేద తీరవచ్చు. ప్రీవెడ్డింగ్ షూటింగ్‌లకు కొందరు ఈమధ్య ఆసక్తి చూపుతున్నారు. 10 నెలల క్రితం పర్యాటకంగా ఈ రెండింటినీ అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ, రెవెన్యూశాఖ అధికారులు పరిశీలించారు. ఇప్పటివరకు ఆదిశగా ఎటువంటి చర్యలూ ప్రారంభం కాలేదు.

తిరుమలలో బిహారీలు

● బాలాజీనగర్‌లో నివాసం

● భద్రతా తనిఖీల్లో గుర్తించిన పోలీసులు



ఇతర రాష్ట్రాలకు చెందిన వారి వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

తిరుమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):తిరుమల కొండపై ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు చాలా మంది నివాసం ఉంటున్నట్టు టీటీడీ గుర్తించింది. తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా చేపడుతున్న తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. వీరిలో అత్యధికంగా బీహార్‌వాసులున్నట్టు గుర్తించారు. స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నట్టు వెల్లడైంది. వీరంతా హోటల్ కార్మికులు. తిరుమలలోని ప్రయివేటు హోటల్ యజమానులు బాలాజీనగర్‌లోని ఇళ్లను అద్దెకు తీసుకుని వీరికి కేటాయిస్తున్నారు. వీరి ఆధార్, ఇతర గుర్తింపు పత్రాలను తిరుమల పోలీసులు సేకరిస్తున్నారు. అలాగే ఎలాంటి గుర్తింపు లేకుండా తిరుమలలో షెడ్లు ఏర్పాటు చేసుకుని నివాసముంటున్న వారిని గుర్తించి తిరుపతికి తరలిస్తున్నారు. ఈ షెడ్లను తొలగిస్తున్నారు.

భక్తుల బ్యాగ్ భద్రంగా..



బ్యాగులోని బంగారు తాళిబొట్టు చైన్‌ను అందజేస్తున్న పోలీసులు

తిరుమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అలిపిరి స్కానింగ్ కేంద్రంలో మర్చిపోయిన బ్యాగును తిరుమల పోలీసులు భక్తులకు తిరిగి అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీధర్ బోపన్న, డాక్టర్ ప్రజ్ఞశ్రీ దంపతులు కుటుంబతో కలిసి బుధవారం ఉదయం కాలినడకన తిరుమలకు చేరుకునేందుకు అలిపిరికి చేరుకున్నారు. అక్కడ బ్యాగుల స్కానింగ్ కేంద్రంలో 80 గ్రాముల బంగారు తాళిబొట్టు గొలుసున్న బ్యాగును మరచిపోయారు. ఆయన తిరుమల పోలీసులను ఆశ్రయించగా కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. దీంతో ఆ బ్యాగు పొరపాటున మరో భక్తుడి లగేజీలో చేరినట్టు గుర్తించారు. వెంటనే ఆభక్తుడిని సంప్రదించి బ్యాగును స్వాధన పరుచుకుని శ్రీధర్ బోపన్నకు బ్యాగును అందజేశారు. నాలుగు గంటల వ్యవధిలోనే బ్యాగును గుర్తించి తిరిగి భక్తులకు అందజేసిన తిరుమల సీఐ శ్రీరాముడు, ఎస్ఐలు లక్ష్మణ్, చలపతిలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్లకు ఆరేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఆరుగురు స్మగ్లర్లకు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షలు చొప్పున జరిమానా విధిస్తూ గురువారం ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఏడీజే న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాసులు కథనం మేరకు.. ఎనిమిదేళ్ళ క్రితం కరకంబాడి ఫారెస్టు బీటు టీఎన్ పాలెం సెక్షన్, తిరుపతి రేంజ్ పరిధిలో జిల్లాకు చెందిన చాంద్‌బాషా, అవినాష్, నాగరాజు, ధనశేఖర్, వరదరాజులు, ఎం.నాగరాజు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నారు. దీనిపై ముందుగా అందిన సమాచారం మేరకు అప్పటి టాస్క్‌ఫోర్సు అధికారులు వీరిని పట్టుకుని అరెస్టు చేశారు. అప్పట్లో వీరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇదే కేసు మళ్లీ తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టుకు కేసు పూర్వాపరాలను టాస్క్‌ఫోర్సు పోలీసులు అందించారు. ఈ క్రమంలో నేరం చేశారని రుజువు కావడంతో ఆ ఆరుగురు స్మగ్లర్లకు న్యాయమూర్తి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

మత్తు వీడండి.. జీవితాన్ని గెలవండి

● యాంటీ డ్రగ్స్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ పిలుపు



ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'ఇటీవల యువత డ్రగ్స్ బారిన పడుతున్నారు. ఆ మత్తులో ఇతర నేరాలకు.. మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. మరోవైపు వారి ఆరోగ్యమూ క్షీణిస్తోంది. అందుకని ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. యువత కూడా మత్తు వీడటం ద్వారా జీవితాన్ని గెలవచ్చు' అని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గురువారం తిరుపతిలో ఆర్డీవో కార్యాలయం నుంచి ఎంఆర్‌పల్లె సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. కొంతమంది యువకులను డ్రగ్స్, గంజాయి అనే మత్తు పదార్థాలు పట్టిపీడిస్తున్నాయని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన స్నేహితులు మాదక ద్రవ్యాలు తీసుకుంటుంటే మౌనంగా ఉండటం మంచిది కాదన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ తీసుకుంటున్నట్టు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పుడే ఈ మహమ్మారిని నివారించగలమన్నారు. 'డ్రగ్స్ ప్రభావం సమాజం మీద ఎలా ఉంటుంది? దీని నిర్మూలనకు ఎలా కృషి చేయాలనే దానిపై పాఠశాల, కళాశాలల్లో ఇతర శాఖల సమన్వయంతో మేము ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం' అని ఎస్పీ వివరించారు. పోలీసులకు సమాచారం ఇద్దాం.. డ్రగ్స్ నివారిద్దాం నినాదంతో ముందుకెళదామని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వద్దు..జీవితం ముద్దు అంటూ ర్యాలీలో విద్యార్థులు, యువత నినాదాలు చేశారు. ప్లకార్డులతో ప్రజల్లో అవగాహన కల్పించారు. అందరిచేత డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద మానవహారంగా నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేత శ్రీనివాసులు, కూటమి నాయకులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, అదనపు కమిషనరు చరణ్‌తేజరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీలు నిర్వహించారు.

ప్రాథమిక పాఠశాలకు తాళం

● విలీనంపై విద్యార్థుల నిరసన

కేవీబీపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తమ ఊరి పాఠశాల తరగతులను మరో గ్రామ పాఠశాలలో విలీనం చేయవద్దంటూ కేవీబీపురం మండలం బంగారమ్మ కండ్రిగలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేశారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో 38 మంది విద్యార్థులున్నారు. ఇటీవల ఈ స్కూలును రెండున్నర కిలోమీటర్ల దూరంలోని ఎస్ఎన్ కండ్రిగ పాఠశాలలో విలీనం చేశారు. తమ పిల్లలు అంత దూరం వెళ్లి చదవడం కష్టంగా ఉంటుందంటూ తల్లిదండ్రులు తాళం వేశారు. చేసేదిలేక ఉపాధ్యాయుడు బయట కూర్చుని సమయం అయ్యాక వెళ్లిపోయారు.





బంగారమ్మ కండ్రిగ స్కూలు ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన - తాళం వేయడంతో బయట కూర్చున్న ఉపాధ్యాయుడు

రాజకీయ ముఖచిత్రం మారబోతోంది

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



చైతన్య రథాలను ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

తిరుపతి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా మైదానంలో జూలై 6వ తేదీ జరగనున్న బీసీ ఆత్మగౌరవ సభతో రాజకీయ ముఖచిత్రం మారబోతోందని, రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రానున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. గురువారం ఉదయం ఆయన బాలాజీకాలనీలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, బీసీ ఆత్మగౌరవ సభ ప్రచార చైతన్య రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆత్మగౌరవ సభతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నానన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్ మాట్లాడుతూ సభను విజయవంతం చేయడంలో భాగంగా అన్ని జిల్లాల్లో పర్యటించేందుకు ప్రచార రథాలను ప్రారంభించినట్లు వివరించారు. టీడీపీ నేత మబ్బుదేవనారాయణరెడ్డి మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. బీసీ సంఘం కన్వీనర్ ఆల్మన్‌రాజు, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ కులమతాలకతీతంగా సభకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ ఎస్టీ కులసంఘాల నేతలు పాల్గొన్నారు.

చంద్రగిరి హైవేలో లారీ హైజాక్

● రాజంపేట వద్ద పట్టుకున్న పోలీసులు

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల పరిధిలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో గురువారం సాయంత్రం లారీ హైజాక్ గురైంది. కర్ణాటక రాష్ట్రం బంగారుపేట నుంచి క్యాబేజీ, క్యాప్సికం లోడుతో లారీ రాజమండ్రికి బయలుదేరింది. గాదంకి టోల్ ప్లాజా వద్ద ఐదుగురు దుండగులు లారీని ఆపి, డ్రైవర్ చరణ్‌కుమార్‌పై దాడి చేసి తీసుకెళ్లారు. డ్రైవరు ఫిర్యాదుతో చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత లారీ కోసం గాలించారు. పోలీసులు లారీని వెంబడించి, రాజంపేట సమీపంలో పట్టుకొన్నారు. ఐదుగురు దుండగులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'ఆభ' కార్డుతో రోగి మెడికల్ హిస్టరీ అనుసంధానం

● జాయింట్ కమిషనర్ డాక్టర్ బీసీకే నాయక్



చంద్రగిరి సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భవ (ఆభ) కార్డుతో రోగి మెడికల్ హిస్టరీ అనుసంధానం చేయబడుతుందని ఏపీ వీవీపీ జాయింట్ కమిషనర్ విజలెన్స్ బీసీకే నాయక్ తెలిపారు. గురువారం చంద్రగిరిలోని సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులను, పరిసరాలను పరిశీలించారు. ప్రతి రోగి తమ వెంట ఆధార్‌తో పాటు ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ ఫోన్‌ను తీసుకురావాలన్నారు. ఆధార్ కార్డుతో 'ఆభ' కార్డు లింక్ చేయబడుతుందన్నారు. తద్వారా దేశంలో ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగి మెడికల్ హిస్టరీ రికార్డు అందుబాటులోకి వస్తుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ హిస్టరీ ద్వారా రోగి సకాలంలో మెరుగైన వైద్య చికిత్సలు అందించడానికి వీలు కలుగుతుందన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ పీజీ జవాబు పత్రాల మూల్యాంకనంపై ప్రత్యేక శ్రద్ధ

● పది రోజుల్లో పూర్తి చేసేందుకు కసరత్తు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మూల్యాంకనం ఆలస్యమైనట్టు అధికారులు గుర్తించారు. దీంతో పది రోజుల్లో పీజీ నాలుగు సెమిస్టర్ల జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి అయ్యేందుకు ప్రణాళిక రూపొందించారు. పీజీ 3, 4వ సెమిస్టర్ల మూల్యాంకనం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీ 1, 2వ సెమిస్టర్ల మూల్యాంకనం వచ్చే నెల 7 వ తేదీ నాటికి పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇకపై యూనివర్సిటీలోని కాలేజీల వారిగా మూల్యాంకనాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్ళకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.